16న ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

ఏలూరు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 9 గంటల నుంచి అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ పి.రజిత తెలిపారు. ఎస్ఎస్‌సీ పాస్/ఫెయిల్, ఐటీఐ, డిప్లమో లేదా ఏదైనా వృత్తి విద్య కోర్సు పూర్తి చేసినవారు పాల్గొనవచ్చని వివరించారు. అన్ని ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నంబరు 08812-230269లో సంప్రదించాలన్నారు.


చెక్కులను అందజేస్తున్న ఎంపీ మహేశ్ కుమార్

ఖజానాను లూటీ చేసిన వైసీపీ ప్రభుత్వం

ఎంపీ పుట్టా మహేశ్ కుమార్

ఏలూరు టూటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను లూటీ చేసి రాష్ట్ర ప్రజలను భ్రష్టు పట్టించిందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 32 మంది లబ్ధిదారులకు వైద్యఖర్చుల నిమిత్తం రూ.63 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నిధుల దుర్వినియోగానికి పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు నియోజకవర్గాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అలాగే బీఎస్ఎన్ఎల్ భవన్‌లో టెలికాం సలహా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ సంస్థ సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బీఎస్ఎన్ఎల్ జీఎం శ్రీనివాస్ బీఎస్ఎన్ఎల్ అధికారులు, సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోడిపందేలను అడ్డుకునేందుకు తనిఖీ బృందాలు

ఏలూరుసిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాల పేరిట కోడిపందేలు, జంతు హింస జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీలను నియమిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని మండలాల్లో 28 సంయుక్త తనిఖీ బృందాలు గట్టి నిఘాతో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఈ కమిటీల్లో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎస్‌హెచ్‌వోలు, ఎన్జీవో ప్రతినిధి, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇద్దరు వీడియో గ్రాఫర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు.

వాహనాల ముందస్తు పన్ను చెల్లించండి : డీటీసీ

ఏలూరు క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వాహనాలకు పన్ను చెల్లించాల్సిన యజమానులు ఈ త్రైమాసిక పన్నును ముందుగానే చెల్లించాలని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. ఈ క్వార్టర్ నుంచి వాహన వెబ్‌సైట్ (నేషనల్ సాఫ్ట్‌వేర్) ద్వారా పన్నులు చెల్లించే కారణంగా ముందుగానే ఆయా వాహన సంబంధిత మండల మ్యాపింగ్, ఈకేవైసీలు వెబ్‌సైట్లలో నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో మోటారు వాహన కేసుల బకాయిలు ఉంటే త్వరితగతిన ఆ రాష్ట్రాల్లోనే అపరాధరుసుం చెల్లించాలన్నారు.

ముస్తాబైన శ్రీవారి క్షేత్రం

- ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి సర్వం సిద్ధం
- ఉదయం 4-30 నుంచి.. భక్తులకు అనుమతి
- తిరుపతి ఘటన నేపథ్యంలో అధికారుల అప్రమత్తం..
- భారీ భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ కిశోర్




విద్యుత్ కాంతులతో ఆలయ గోపురాలు.. ఏర్పాట్లపై ఎస్పీ కిశోర్ అధికారులతో సమీక్ష



ద్వారకాతిరుమల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ద్వారకాధీశుని దివ్యక్షేత్రంలో శుక్రవారం జరగనున్న ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెల్లవారుజాము 4.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉత్తరద్వారం వద్ద దర్శనాలకు అనుమతిస్తామని ఈవో త్రినాథరావు తెలిపారు. ఉత్తర ద్వారాన్ని, స్వామి ఆశీనులయ్యే గరుడ వాహనాన్ని, పరిసరాలను పూలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. తొలుత వెండి గరుడ వాహనంపై ఉభయ దేవేరులతో కొలువై దర్శనమిచ్చిన శ్రీవారు తర్వాత వెండి శేష వాహనంపై దర్శనమిస్తారు. ముక్కోటి నాడు స్వామిని దర్శించాలని దూరప్రాంతాల దీక్షాధారులు గురువారం రాత్రికే ఆలయానికి చేరుకున్నారు. దర్శనానంతరం ఇరుముడులు సమర్పిస్తారు.

అధికారుల అప్రమత్తం

వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ నేపథ్యంలో తిరుమలలో చోటు చేసుకున్న పెనువిషాదాన్ని దృష్టిలో ఉంచుకుని ద్వారకాతిరుమలలో అధికారులు అప్రమత్తమయ్యారు. చిన వెంకన్న ఉత్తరద్వార దర్శనం సమయంలో ఏ అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లుచేశారు. ఆలయ సెక్యూరిటీని అప్రమత్తం చేయడంతోపాటు, పోలీస్

మిగతా 6వ పేజీలో..



సప్తగిరివాసుడి గిరి ప్రదక్షిణ

శ్రీనివాసా గోవిందా.. వేంకటేశా గోవిందా.. ఆపద్బాంధవ గోవిందా.. అనాథ రక్షక గోవిందా అంటూ భక్తి పారవశ్యంతో శ్రీవారి భక్తులు పులకించారు. గురువారం చినవెంకన్న గిరి ప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 4లో..

రీసర్వే..రగడ!



గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆ పార్టీ నేతలు ఏకపక్షంగా ఊళ్ళల్లో ఆగమాగం చేశారు. ఎదురు తిరిగితే అక్రమ కేసులు పెట్టారు. విలువైన భూములను కాజేసే ప్రయత్నం చేశారు. ప్రత్యేకించి రీసర్వే వ్యవహారమంతా తప్పులు తడకగా మారింది. భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ముందుకొచ్చి రెవెన్యూ సదస్సులు నిర్వహించగా ఈ లొసుగులన్నీ బహిర్గతమయ్యాయి. రాబోయే నెలన్నర రోజుల్లోనే పరిష్కారం దిశగా ఇప్పుడు యంత్రాంగం అడుగులు వేస్తుంది.

జిల్లాలో ముగిసిన రెవెన్యూ సదస్సులు.. రీసర్వే పైనే ఫిర్యాదుల వెల్లువ

- ఆనాటి చేదు అనుభవాలపై ఇప్పుడు రాతపూర్వకంగా ఫిర్యాదులు
- 22ఏ భూముల వ్యవహారం బహిర్గతం
- ఊరువాడా అన్నీ భూ సమస్యలే
- జిల్లాలోనే 6,453 అర్జీలు
- వచ్చే నెలన్నరలోపే పరిష్కార దిశగా అడుగులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ నేతల ఆగడాలను బహిర్గతం చేయలేక వేలాది మంది బాధితులు నోరు మెదపలేదు. తమ భూముల్లో రీసర్వే జరిగినా, మరొకటి జరిగినా ఉన్న భూములు కాస్తా హద్దులు దాటడం అందరినీ ఆగ్రహానికి గురిచేసింది. అయినా అప్పట్లో అధికారులు ఏ ఒక్కరూ ప్రజల పక్షాన నిలవలేకపోయారు. దీనినే ఆసరాగా చేసుకుని వైసీపీ విచ్చలవిడిగా వ్యవహరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ వివాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రజల వద్దకు అధికారులను తరలించింది. రెవెన్యూ సదస్సుల పేరిట ప్రతీ గ్రామంలోను ప్రత్యేక సభ నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించింది. జిల్లాలో 669 గ్రామాల్లో బుధవారంతో రెవెన్యూ సదస్సులు ముగిశాయి. ఈ సదస్సుల్లో ప్రజల నుంచి 6,453 ఫిర్యాదులు అధికారులకు అందాయి. వీటిలో పరిష్కార యోగ్యంగా ఉన్న 3,312 అర్జీలను సరిచేశారు. మిగిలిన దరఖాస్తులను రానున్న నెలన్నర రోజుల్లోనే పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. మిగిలిన వాటిలో మాత్రం రీసర్వే, 22ఏ వివాదాలే అత్యధికంగా ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

విలువైన భూములపై కన్ను

రీసర్వేలో హద్దులు పాతే క్రమంలో ఏకపక్షంగా వ్యవహరించినట్టు అప్పట్లోనే రైతులంతా లబోదిబోమన్నారు. ఎక్కడ విలువైన భూమి ఉందో అక్కడ అధికారికంగా దురాక్రమణ చేసేందుకు వైసీపీ నేతలు పన్నిన పన్నాగానికి కింది స్థాయి అధికారులు సహకరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వాటినే రెవెన్యూ సదస్సుల్లో రైతులు, స్థానికులు రాతపూర్వక ఫిర్యాదులు అందించారు. ప్రత్యేకించి నూజివీడు, చింతలపూడి, కైకలూరు వంటి నియోజకవర్గాల్లో రీసర్వేకు సంబంధించిన వివాదాలే ఇప్పుడు కోకొల్లలుగా బయటపడుతున్నాయి.

22ఏ పైనా ప్రభుత్వం దృష్టి

22ఏ పరిధిలోని నిషేధ భూములను సడలించి రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇచ్చారు. దీనిని సాకుగా తీసుకుని వైసీపీ అనుకూలురంతా తెగబడ్డారు. ప్రాథమిక సమాచారం మేరకు రెండు వేల ఎకరాలకు పైగానే 22ఏ నిషేధ భూములు ఉండగా ఇప్పుడు కొన్ని గ్రామాల్లో పెద్దల ఆధీనంలోకి మారాయి. భూవివాదాలు, భూఆక్రమణలు, నిషేధ భూముల్లో రిజిస్ట్రేషన్‌కు దిగడం వంటి వ్యవహారాలన్నీ రెవెన్యూ సదస్సుల రూపంలో వెలుగులోకి వచ్చాయి. దీంతోపాటు సరిహద్దు తగాదాలు అత్యధికంగా ఉండగా దీనికి ప్రధాన కారణం రీసర్వేగానే భావిస్తున్నారు. కుంటలు, గ్రామ శివారు భూములన్నింటినీ అప్పట్లో ఏకపక్షంగా మింగేయగా ఇప్పుడు అవన్నీ అధికారుల పరిశీలనకు వెళ్ళబోతున్నాయి.

నెలన్నరలోనే నిగ్గు తేలుస్తాం..

22ఏ భూముల వ్యవహారంలో ప్రభుత్వం సీరియస్‌గానే ఉంది. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని విచారణ చేయబోతున్నారు. రాబోయే నెలన్నర రోజుల్లోనే ఈ వ్యవహారాన్ని చక్కబెట్టాల్సిందిగా కలెక్టర్‌కు ఇప్పటికే ఆదేశాలు అందాయి. మార్చిలోపే ఈ వ్యవహారాలన్నింటినీ చక్కబెట్టేందుకు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారా.. లేదా మునుపటి మాదిరిగానే ఒత్తిళ్లకు తలొగ్గి ఏకపక్షంగా వ్యవహరిస్తారా.. అనేది త్వరలోనే తేలబోతుంది.

రెవెన్యూ సేవల్లో పారదర్శకత ముఖ్యం : కలెక్టర్

ఏలూరుసిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సేవల్లో పారదర్శకత, వేగం, నాణ్యత ముఖ్యమని, భూముల రీసర్వే అర్జీలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జేసీ ధాత్రిరెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, భూసేకరణ, రీసర్వే నిషేధిత భూములు, కోర్టు కేసులు తదితర అంశాలపై సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జిల్లా రెవెన్యూ సదస్సుల్లో 6,453 అర్జీలు రాగా 3,312 అర్జీలను పరిష్కరించామన్నారు.

ప్రతిభ కనబరిచిన తహసీల్దార్లకు ర్యాంకింగ్‌లు

రెవెన్యూకు సంబంధించిన అంశాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ర్యాంకింగ్‌లను ప్రకటించారు. ఇందులో మొదటి ర్యాంక్ భీమడోలు తహసీల్దార్ రమాదేవి, చింతలపూడి, పెదపాడు తహసీల్దార్లు ప్రమద్వార, కృష్ణజ్యోతి ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారు. మొదటి ర్యాంకు సాధించిన రమాదేవికి కలెక్టర్ మెమోంటో అందించి, శాలువాతో సత్కరించారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు శిక్షణను సద్వినియోగించుకోవాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ



ఏలూరు సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టే పనుల్లో అర్హులైన ప్రతి వారు లబ్ధి పొందేలా చూడాలని, కూలీలకు రూ. 300 వేతనం అందేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు వీఆర్ కృష్ణతేజ పేర్కొన్నారు. స్థానిక క్రాంతి కల్యాణ మండపంలో గురువారం జిల్లా స్థాయి ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ క్షేత్ర సహాయకుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు. జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత అవగాహన పెంచుకుని ఉపాధి పనుల్లో మంచి ఫలితాలను రాబట్టడానికి ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఒకే రోజు రాష్ట్రంలో 13వేల 326 గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ సభల ద్వారా పనులు గుర్తించడం ప్రపంచంలోనే రికార్డ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ ద్వారా రూ. 4,500 కోట్లతో 3,500 కిలోమీటర్ల మేర సీసీ రహదారులు, బీటీ రోడ్లు, మరమ్మతులు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో మూడు నెలల్లో 12,500 గోకులాలను పూర్తి చేశారన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు జీవనోపాధి కల్పించడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి డైరక్టర్ వైవీ షణ్ముఖకుమార్, అడిషనల్ కమిషనర్ పంచాయతీరాజ్ మల్లెల శివప్రసాద్, ఏలూరు డ్వామా పీడీ వెంకట సుబ్బారావు, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీపీవో అనూరాధ, ఏపీడీలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్లు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ

1975 మంది అభ్యర్థుల అర్హత

వేద పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య

బాలికపై అత్యాచారం

5




సెలవులు ఇవ్వడంతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు..కిక్కిరిసిన ఏలూరు బస్టాండ్

సొంతూళ్లకు చలో..చలో

ఏలూరు క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులు ఇవ్వడంతో స్వస్థలాలకు విద్యార్థులు పయనమయ్యారు. నగరంలోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఆర్టీసీ అధికారులు అదనపు సర్వీసులను ఏర్పాటు చేశారు. మరో వైపు దూర ప్రాంతాల నుంచి సంక్రాంతికి వచ్చే వారికి, తిరిగి వెళ్ళే వారికి టిక్కెట్‌లో 10 శాతం రాయితీ ఇవ్వ డంతో ఆర్టీసీలో బస్సుల్లో ఇప్పటికే 80 శాతం టిక్కెట్లు రిజర్వేషన్ అయిపోయాయి. 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వగా, మైనార్టీ విద్యా సంస్థలకు ఈనెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సెలవులు ఇవ్వనున్నారు. కాగా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కాంట్రాక్టు క్యారేజీ యజమానులు బస్సుల ఛార్జీలు అధికంగా పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు ఆర్టీవో కేఎస్ఎంవీ కృష్ణారావు హెచ్చరించారు. చొదిమెళ్ళలోని రవాణా శాఖ కార్యాలయంలో గురువారం జిల్లాలో ఉన్న కాంట్రాక్టు క్యారేజీ యజమానులతో ఈ మేరకు సమావేశాన్ని నిర్వహించారు.

పండగ హడావుడి

సంక్రాంతి పండగ హడావుడి మొదలైపోయింది.. స్కూళ్లకు సెలవులు ప్రకటించడంతో అంతా ఊర్లకు బయలుదేరారు..హాస్టల్లో ఉండే తమ పిల్లలను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకు వెళుతున్నారు.. ఇక స్కూళ్లలో సంక్రాంతి సందడికి తెరలేపారు.. భోగిమంటలు, గొబ్బె మ్మలు, బొమ్మలకొలువులు ఏర్పాటు చేసి ముందే పండుగ చేస్తున్నారు.. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో అదరగొట్టారు..



గొబ్బిళ్లోయ్..గొబ్బిళ్లు : పెనుగొండ భాష్యం స్కూల్లో గొబ్బెమ్మలు పెడుతున్న చిన్నారులు..



భోగి మంటల్లో ఆవు పిడకల దండలు వేస్తున్న విద్యార్థులు









ఏలూరులో ఇళ్లకు వెళ్లే ఉత్సాహంలో..





భీమవరం విష్ణు స్కూల్లో గోదా కల్యాణం.. బొమ్మల కొలువు ప్రదర్శన



రాష్ట్రపతి కార్యాలయం నుంచి వచ్చిన ఆహ్వాన పత్రిక అందుకుంటున్న సుబ్బారావు

రైతుల కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటాను..

ఆంధ్రజ్యోతితో ఆచంట రైతు సుబ్బారావు

గణతంత్ర వేడుకలకు రాష్ట్రపతి నుంచి ఆహ్వానం

ఆయన చదివింది ఎస్ఎస్ఎల్సీ.. కానీ చూసేవారికి ఆయన ఒక వ్యవసాయ శాస్త్రవేత్తగా కనిపిస్తారు.సాగులో ప్రయోగాలు చేశారు.. కొత్త వంగడాలను సృష్టించారు.. 89 సంవత్సరాల వయసులో కూడా వ్యవసాయాన్ని నమ్ముకుని అనేక మంది రైతులకు అనేక సేవలందిస్తున్నారు..వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడుతున్న ఆయన కృషిని గుర్తించి అభినందిస్తూ ఈనెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు రావాలంటూ రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఆహ్వానం పంపారు..ఆయనే ఆచంటకు చెందిన కృషి పండిట్ నెక్కంటి సుబ్బారావు... ఈ సందర్భంగా ఆయనను ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విషయాలు ముచ్చటించారు... - ఆచంట (ఆంధ్రజ్యోతి)

- చిన్న వయసు నుంచే వ్యవసాయం

1960లో మా తండ్రి వీరాస్వామి కాలం చేశారు.. అపుడు నేను ఎస్ఎస్ఎల్సీ చదువుతున్నాను.. ఆ వయసులోనే కుటుంబ బాధ్యతలు నా మీద పడ్డాయి. అపుడు నా వయస్సు 20 సంవత్సరాలు ... మేము మొత్తం ఆరుగురు అన్నదమ్ములం. మా పెద్ద అన్నయ్య నాగేశ్వరరావు వ్యవసాయం చేసేవారు. అతని వద్ద నేను వ్యవసాయం నేర్చుకున్నాను. అప్పటి నుంచి వ్యవసాయం పైనే మక్కువ చూపాను.

- ఆచంట నుంచి కొత్త వరి వంగడం..

దేశంలో ఆహార కొరత ఎక్కువగా ఉన్న కాలం అది. ఆ సమయంలో 1967లో అప్పటి కేంద్ర ఆహార శాఖా మంత్రి సుబ్రహ్మణ్యం ఫిలిప్పీన్స్ నుంచి ఐర్-8 అనే వరి వంగడాన్ని రప్పించి కోయంబత్తూర్, మార్టేరు వరి పరిశోధనా కేంద్రాలకు పరిశోధన నిమిత్తం పంపించారు.. మొదట్లో సాగు చేసినా పెద్దగా దిగుబడి రాలేదు.. విజయవాడలో ఈ రకం అభివృద్ధికి శాస్త్రవేత్తలు సమావేశం నిర్వహించగా వెళ్లాను.. ప్రత్యేకంగా ఆ వరి రకం తీసుకువచ్చి అభివృద్ధి చేసి రెండు వేల ఎకరాల్లో సాగు చేపట్టాం. ఏకంగా 40 బస్తాల దిగుబడి వచ్చింది. ఈ సీడ్‌ను దేశంలోని అనేక రాష్ట్రాలకు పంపడంతో రైతులు మంచి దిగుబడులు సాధించారు.

- దిగుబడుల సాధనకు కృషి చేస్తూనే ఉంటా..

ఆచంట పక్కనే మార్టేరులో వరి పరిశోధన స్థానం ఉండటంతో తరచూ అక్కడకు వెళ్లేవాడిని. అక్కడున్న శాస్త్రవేత్తలతో మాట్లాడేవాడిని.. సాగులో మెలకువలను తెలుసుకునేవాడిని.. కొత్త వండగాల అభివృద్ధికి వారి సూచనలు, సలహాల మేరకు వరిసాగు చేసేవాడిని.. అధిక దిగుబడులు సాధించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటాను. వ్యవసాయంలో నేను చేస్తున్న కృషికి ఇప్పటివరకు 16 నేషనల్, మూడు ఇంటర్నేషనల్ అవార్డులతో పాటు 29 అవార్డులు వచ్చాయి. 2013లో గుజరాత్‌లో నరేంద్రమోదీ చేతుల మీదుగా సన్మానం చేసి షీల్డ్ అందించారు.ఫిలిప్పీన్స్‌లో ఆర్ఐ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా అవార్డు పొందాను.

- రైతుల్లో అవగాహనకు కృషి

ప్రస్తుతం సొంత వ్యవసాయం 12 ఎకరాల్లో పాటు మరో 20 ఎకరాలకు సంబంధించి కౌలు వ్యవసాయం కూడా చేస్తున్నాను. అత్యంత సన్నరకం ఆర్‌జీఎల్ 7034, 7039 వరి వంగడాలు దాళ్వా సాగులో చేస్తున్నాను. వ్యవసాయంలో నేను చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్రపతి ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు ఆహ్వానం పంపడం చాలా ఆనందంగా ఉంది.. ప్రస్తుతం నూటికి 80 శాతం కౌలు రైతులు 20 శాతం రైతులు వ్యవసాయం చేస్తున్నారు. కౌలు రైతులు సరైన అవగాహన లేకపోవడంతో ఎరువులు షాపుల్లో ఇచ్చే ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడుతున్నారు. ఎక్కువ ఎరువుల వినియోగం వల్ల దిగుబడి కూడా తగ్గుతుంది. వ్యవసాయం ఎలా చేయాలి ? ఎరువులు ఎలా వాడాలనే దానిపై కరపత్రాలు ముద్రించి రైతులకు అందిస్తున్నాను.





నరేంద్రమోదీ నుంచి షీల్డ్ అందుకుంటున్న సుబ్బారావు... ఫిలిప్పైన్స్‌లో ఇంటర్నేషనల్ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా 2013లో అవార్డు అందుకుంటూ..

శ్రీనివాసా..గోవిందా !

ద్వారకాతిరుమలలో వైభవంగా గిరిప్రదక్షిణ

ద్వారకాతిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో గురువారం జరిగిన గిరిప్రదక్షిణతో శేషాచల పరిసరాలు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాయి. శ్రీనివాసా గోవిందా...శ్రీ వేంకటేశా గోవిందా...ఆపద్బాంధవ గోవిందా.. అంటూ భక్తులు ఆలయ తొలిమెట్టు వద్ద ముందుగా భజనలు చేశారు. అలంకరించిన ధర్మప్రచార రథంలో కొలువైన శ్రీవారి దివ్యమూర్తులకు ఆలయ ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఈవో వేంద్ర త్రినాధరావు దంపతులు రథం ముందు బలిహరణ సమర్పించి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, కోలాట ప్రదర్శ నలు, కేరళ వాయిద్యాలు, తీన్‌మార్‌ల నడుమ గజ, వృషభ, అశ్వాలు ప్రచారరథం ముందు నడుస్తుండగా అశేష జనవాహినితో జరిగిన ఈ గిరిప్రదక్షిణతో రహదారులు కిక్కిరిశాయి. ఆలయం వద్ద ధనుర్మాస మండపం వద్ద ప్రారంభమై కొత్త బస్టాండ్, దొరసానిపాడు, రాళ్లకుంట, శేషాచల ఘాట్ రోడ్డు, ఉగాది మండపం మీదుగా 6కి.మీ మేర అంగరంగ వైభవంగా తిరిగి ఆలయానికి చేరుకుంది. మార్గమధ్యలో భక్తులకు దాతల సహకారంతో పండ్లు, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు..

యాత్రలో సందడి చేసిన బాలల కోలాట ప్రదర్శన, వేషధారణలు, కేరళవాయిద్యాలు..



గిరిప్రదక్షిణలో గజలక్ష్మి







జన్మనిచ్చిన తల్లిని... పుట్టిన ఊరును మరవరాదని చెబుతుంటారు.. విదేశాల్లో ఉద్యోగ, వాప్యారాల్లో స్థిరపడి తమ సొంతూరుకు ఎంతో కొంత సేవ చేయాలనే ఆలోచన చేయడం అభినందనీయమే..బాగా సంపాదించి తమ ముందు తరాలకు కోట్లు కూడ బెట్టాలనే ఆశ ఉన్నవారూ ఉంటారు... కానీ సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి ఉపయోగపడే విధంగా ఖర్చు చేస్తున్నవారిని అభినందించాల్సిందే..

సొంత ఊరికి కొంత మేలు..

జన్మభూమి సేవలో ప్రవాసాంధ్రులు



పొన్నపల్లిలో పేదలకు కట్టించిన ఇల్లు

యువతకు ఉపాధి కల్పిస్తున్న కొవ్వలి నాయుడు



నరసాపురానికి చెందిన కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు అమెరికాలో స్థిరపడ్డారు.తాను పడిన కష్టాలు నిరుద్యోగులకు ఉండకూడదన్న ఉద్దేశంతో ఎంతో మందిని సొంత ఖర్చులతో అమెరికా తీసుకు వెళ్లి చదివించి, అక్కడ వారికి తన కంపెనీలో ఉపాధి కల్పిస్తున్నారు. ఇలా నరసాపురం నుంచి 100 మందిపైనే ఉంటారు. ఇక నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. ఆర్థికంగా స్తోమత లేని 20 మంది డిగ్రీ, ఇంటర్ విద్యార్థులను ఆయన చదివిస్తున్నారు. ప్రతి నెల 20 కుటుంబాలకు పైనే మందులు, నిత్యవసరాలు పంపిణీ చేస్తున్నారు. ప్రమాదాల్లో కాలు కోల్పోయిన వారి కోసం ప్రత్యేకంగా క్యాంపు పెట్టి ఉభయగోదావరి జిల్లాల్లో సుమారు 100 మందికి కృత్రిమ కాళ్లు అందించారు. నియోజకవర్గంలో సుమారు 30కుపైగా అలయాలకు విరాళాలు ఇచ్చి ఆధునీకరించారు. పట్టణంలో కాపు కళ్యాణ మండపాన్ని రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేశారు. వందేళ్ల నాటి కుమ్మరవీధి రామాలయాన్ని రూ.కోటితో పునర్ నిర్మించారు. 2022 తుఫాన్ సమయంలో నీటి మునిగిన పొన్నపల్లి, కొత్త, పాత నవరసపురం గ్రామాల్లో సుమారు రూ.15 లక్షలు వెచ్చించి నిత్యావసరాలందించారు. అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన బాధితులకు ఇళ్ల కట్టించి ఇచ్చారు. తాను పుట్టిన ఊరు కోసం ఇలా తనవంతు సాయం చేస్తూనే ఉన్నారు. స్థానికంగా ఎంతోమంది ఇంజనీరింగ్ విద్యార్థులకు వర్క్‌ఫ్రం హోం కింద తన కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. కొవ్వలి ఫౌండేషన్ పేరుతో ఆయన చేస్తున్న సేవల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రశంసించారు.చేస్తున్న పనుల గురించి ఏవరైనా పొగిడితే...ఊరు నాకు గుర్తింపునిచ్చింది... ఇంకా చేయాల్సింది చాలా ఉందని చెబుతుంటారు.

- నరసాపురం (ఆంధ్రజ్యోతి)

దాహార్తి తీరుస్తున్న వేగేశ్న ఫౌండేషన్



గణపవరానికి చెందిన ప్రవాసాంధ్రుడు, వేగేశ్న ఫౌండేషన్ చైర్మన్ అనంతకోటి రాజు

ఆయన చేతికి ఎముకలేదు అంటారు. ఎవరు సాయం అడిగినా కాదనరు. గణపవరం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు వేగేశ్న అనంతకోటిరాజు అమెరికా వెళ్లి అక్కడ వ్యాపారంలో స్థిరపడ్డారు. దేనికి లోటులేదు.. అయినా జన్మభూమిని మరచిపోలేదు. సొంత ఊరిలోనే కాకుండా పలు రాష్ట్రాల్లో ఆయన సేవ చేస్తున్నారు. తన సంపాదనతో సొంత గడ్డకు కొంతైనా మేలు చేయాలనే లక్ష్యంతో స్వగ్రామం అయిన గణపవరంలో జగన్నాధపురం కేంద్రంగా రాజు వేగేశ్న ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రారంభించారు. తన తండ్రి ఏసుదాతరాజు అన్న ఆనందరాజుల ఆధ్వర్యంలో సేవలు కొన సాగిస్తున్నారు. ఆనందరాజు హైదరాబాదు, విశాఖపట్నం కేంద్రాలుగా చేసుకుని సేవలు విస్తరిస్తున్నారు. తండ్రి ఏసుదాత రాజు గణపవరంతో పాటు జిల్లా ప్రజలకు మంచినీరు, విద్యా, ఆరోగ్యం, దేవాలయాల అభివృద్ధికి సహకరిస్తున్నారు. గణపవరంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.18లక్షలతో మినరల్ వాటర్ ప్లాంటు నిర్మాణం చేశారు. అదనపు మంచినీటి చెరువుల ఏర్పాటుకు సుమారు 8 ఎకరాల భూములు కొనుగోలు చేశారు. రూ.60 లక్షల వ్యయంతో వేంకటేశ్వరస్వామి ఆలయం, కల్యాణ మండపాలు నిర్మించారు.గ్రామంలో రూ.23 లక్షలతో హిందూ శ్మశానవాటిక ఆధునీకరించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, బాలుర హైస్కూల్ అభివృద్ధికి విరాళలు ఇచ్చారు. గణపవరంలో దీర్ఘకాలికంగా పేదలకు ఇళ్ళస్థలాల సమస్య ఉండటంతో స్పందించి స్థలం కొనుగోలుకు 30 ఎకరాలు సేకరించారు. దీని నిమిత్తం తనవంతుగా రూ.50 లక్షలు అప్పటి దివంగత ముఖ్యమంత్రి రాజ శేఖర్‌రెడ్డికి అందజేశారు. దీంతో ప్రభుత్వ వ్యయంతో 1200 మంది పేదలకు మోడల్ కాలనీ నిర్మాణానికి చేయుతనిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వెంగమాంబ నిత్యాన్నదాన భవన నిర్మాణం, భక్తులకు విశ్రాంతి భవనం, మంచినీటి సౌకర్యార్థం వాటర్ ప్లాంటులకు సుమారు రూ.40 కోట్లు వెచ్చించారు. శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, తదితర 50 ప్రధాన పుణ్య క్షేత్రాల్లో వాటర్‌ప్లాంట్లు నిర్మించి స్వచ్ఛమైన తాగునీరు భక్తులకు అందజేశారు. దేశవ్యాప్తంగా అనేక రైల్వేస్టేషన్లలో వేగేశ్న ఫౌండేషన్ ద్వారా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నారు.

- గణపవరం (ఆంధ్రజ్యోతి)



ప్రసిద్ధ ఆలయాల వద్ద ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్లు



విద్యార్థినికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న డిఈవో నారాయణ

గణతంత్ర వేడుకలకు సరస్వతీ విద్యాలయ విద్యార్థిని

పెంటపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రత్తిపాడు గ్రామానికి చెందిన సరస్వతీ విద్యాలయ విద్యార్థిని జవ్వాది రాహిని ఈనెల 26 న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నట్టు మండల ఎంఈవో-2 టీవీ రామకృష్ణ తెలిపారు. ఆజాదీ కి అమృత్ మహోత్సవాల్లో భాగంగా కేంద్రప్రభుత్వం చేపట్టిన వీరగాధ 4.0 కార్యక్రమంలో రాష్ట్రంలో విద్యార్థులందరికి దేశం కోసం త్యాగం చేసిన వీరుల పట్ల అవగాహన కల్గించడం కోసం ఆన్‌లైన్‌లో వ్యాసరచన, పెయింటింగ్, పద్యరచన పోటీలను నిర్వహించారన్నారు. ఈ పోటీలకు జిల్లా నుంచి సుమారు 98 వేల ఎంట్రీలు నమోదు కాగా విద్యార్థి రాహిని నేషనల్ టాప్ హండ్రెడ్ ఎంట్రీస్‌లో ఒకటిగా నిలిచిందన్నారు. రూ..10 వేలు నగదు బహుమతి సాధించిందన్నారు. డీఈవో నారాయణ, , సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజక్టు కోఆర్డినేటర్ శ్యాం సుందర్ ఎంఈవో-1 శ్రీనివాస్, సరస్వతి విద్యాలయ ప్రిన్సిపాల్ కొలనువాడ వెంకట్ అభినందించారు.

రాయకుదురులో నేటి నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

వీరవాసరం(భీమవరంటౌన్)జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణదేవరాయ నాటక కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటక పోటీలు రాయకుదురులో జనవరి 10, 11,12 వ తేదీల్లో నిర్వహించ నున్నట్టు కళా పరిషత్ అధ్యక్షుడు గోపాల కృష్ణ కెఎస్ఆర్‌కె, కార్యదర్శి డాక్టర్ అడబాల లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. 10వ తేదీ రాత్రి మొదటి ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం, రెండో ప్రదర్శనగా అనకాపల్లి వారి మలి సంధ్య, 11న పాలకొల్లు నటీనట సమాఖ్య వారి అనూహ్యం నాటిక ప్రదర్శిస్తారన్నారు.

తేనెలొలుకు...తెలుగు భాష



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు (ఇన్‌సెట్‌లో) మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులకు సత్కారం

- పులకించిన తెలుగు తల్లి
- తరలివచ్చిన భాషాభిమానులు
- అతిథులకు పురస్కారాలు...సత్కారాలు
- రాజమండ్రిలో ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలు

రాజానగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష మాధుర్యం, వేర్వేరు ప్రాంతాల యాసలతో తెలుగు తల్లి పులకించింది. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. మాతృభాషను కీర్తిస్తూ పలువురు రాజకీయ ప్రముఖులు, కవులు, రచయితల ప్రసంగాలతో తెలుగు తల్లి ఉప్పొంగి పోయింది. తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ భాషాభిమానులంతా తన్మయత్వంలో మునిగితేలారు. జీజీయూ కులపతి కలిదిండి సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షతన రాజరాజ నరేంద్ర వేదికపై ప్రారంభమైన రెండో రోజు వేడుకలకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సభాధ్యక్షత వహించగా, ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులు శంఖారావం పూరించి సభలను ప్రారంభించారు. పలువురు రాజకీయ సాహితీ ప్రముఖులు, అవధానులు, కవులు, రచయితలు, కళాకారులు తెలుగు భాష ఔన్నత్యాన్ని వెలుగెత్తి చాటారు.

తెలుగు భాషను కాపాడుకోవాలి

కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ అమ్మభాషైన తెలుగుభాష మూలాలను పిల్లలకు వివరించడం ద్వారా తెలుగు భాషను కాపాడుకోవాలన్నారు. రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగుభాష పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

యూనిటీకి మించిన శక్తి లేదు..

మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ యూనిటీకి మించిన శక్తి లేదని, దీని మూలంగానే పాండవులు విజయం సాధించారన్నారు. తెలుగు భాషకు చావు లేదని, దానిలో మునిగి తేలితే చాలన్నారు. తెలుగు జాతి వారికి సంస్కారం ఎక్కువని, ఇది ఎవ్వరూ నేర్పేది కాదన్నారు. విదేశాల్లో సైతం తెలుగు సంస్కృతిని, సంప్రదాయాలను పాటిస్తున్నారన్నారు. ఒకరినొకరు గౌరవించుకోవడం తెలుగుజాతి సొంతమన్నారు.



అతిథులకు ఘన సత్కారాలు

సమావేశంలో చివరిగా అతిథులను ఘనంగా సత్కరించి, పురస్కారాలు అందజేశారు. దీనిలో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులను, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులను సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. అలాగే కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, చామర్తి రాజు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కవి గరిమెళ్ల వరప్రసాద్, వసుధా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లంక దినకర్, అందె శ్రీను, గోపిమూర్తిలను ఘనంగా సన్మానించి, పురస్కారాలు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

ప్రపంచ తెలుగు మహాసభలు ముగింపు వేడుకల్లో భాగంగా గురువారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చేసిన పలు శాస్త్రీయ, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి.



భీమడోలులో విజిలెన్స్ తనిఖీలు

ఏలూరు క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్సు అధికారులు భీమడోలులో గురువారం ఆయిల్ షాపులను తనిఖీ చేశారు. విజిలెన్సు ఎస్‌ఐ కె సీతారామ్, ఆహార తనిఖీ అధికారి కె రామరాజు వారి సిబ్బంది కలిసి భీమడోలులోని ఆయిల్‌షాపులు అయిన మెస్సర్స్ జె శ్రీవేంకటేశ్వరస్వామి ట్రేడర్స్, మెస్సర్స్ శ్రీ రామచంద్ర ఎంటర్ ప్రైజెస్‌లలో తనిఖీలు నిర్వహించారు. వాటిలో కల్లూర్ లైన్ గ్రౌండ్ నట్ ఆయిల్, సూపర్ గ్రౌండ్ నట్ ఆయిల్ శాంపిల్స్‌ను నాణ్యత పరీక్షల కోసం సేకరించారు.

మండవల్లి సబ్ రిజిస్ట్రార్‌గా బాలాజీ

మండవల్లి జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండవల్లి సబ్ రిజిస్ట్రార్‌గా బాలాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సుమారు 8 నెలలుగా మండవల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇన్‌చార్జి సభ్యులతో నడుస్తోంది. ఎట్టకేలకు మండవల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రార్ ను నియమించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోడీలు కావలెను!

- జోడీల వేటలో పందేల నిర్వాహకులు
- పెంచిన కోళ్లకు వైరస్ సోకడంతో కథ మొదలు
- ఈ ఏడాది నాలుగు చోట్ల భారీ బరులకు సన్నాహాలు
- ఇప్పటికే నిండుకున్న లాడ్జీలు



పుంజులకు ఈతలో తర్ఫీదు

తాడేపల్లిగూడెం రూరల్/నరసాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వస్తోంది. కోడి పందేలకు పశ్చిమలో బరులకు సన్నాహాలు దాదాపు పూర్తయ్యాయి. ఇంక కావాల్సింది పుంజులు. వాటిని ముందుగానే సిద్ధం చేసుకున్న నిర్వాహకులకు వైరస్ వల్ల పుంజులు మృత్యువాత పడటంతో జోడీల కొరత నిర్వాహకులకు తలనొప్పిగా మారింది. దీంతో నిర్వాహకులంతా జోడీల కోసం జల్లెడ పడుతున్నారు. ఏ నిర్వాహకుడికి ఎన్ని జోడీలు ఎక్కువ దొరికితే ఆ బరి రసవత్తరంగా మారుతుందని పందెం రాయుళ్లు ఆ బరికి క్యూ కడతారని నిర్వాహకులు ఆశిస్తున్నారు. దీంతో ఎక్కువ జోడీలను సొంతం చేసుకునేందుకు లక్షలు వెచ్చించేందుకు సిద్ధమయ్యారు. ఆరు నెలల ముందు నుంచి పందాల నిర్వాహకులు పుంజులను ఎంపిక చేసుకుని ఆ పుంజుల పెంపకందారులకు ముందస్తుగా మేతకు సొమ్ములు ఇచ్చి బుక్ చేసుకునే ఆనవాయితీ మొదటి నుంచి ఉంది. అయితే ఈ ఏడాది ఎప్పటిలాగే పుంజుల పెంపకందారులకు మేతను నిర్వాహకులు భరించారు. అయితే పందాలు దగ్గర పడే సమయంలో పుంజులు వైరస్ బారినపడి మృత్యువాత పడటంతో నిర్వాహకులు ఆందోళనలో పడిపోయారు.

బరికి రోజుకు 50 నుంచి 100 జోడీలు

బరి వేయాలంటే ముందు పందెగాళ్లను ఆకట్టుకోవాలి. ఆ పందెగాళ్లను ఆకట్టుకునేందుకు సరిజోడీలను రంగంలోకి దింపాలి. దింపిన జోడీలపై పందెగాళ్లు వేసే పందేలపైనే పండగ సంబరం పెరుగుతుంది. బరివేయాలనుకునే నిర్వాహకులు ఏడాది ముందుగానే జోడీలను సిద్ధం చేసుకుంటారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల వచ్చిన మార్పులతో పెంచుకున్న జోడీలు కాస్త ఖాళీ కావడంతో వారిలో జోడీల గుబులు మొదలైంది. దీంతో రోజుకు 50 నుంచి 100 జోడీలు లెక్కలేసి పందెం పుంజుల పెంపకందారులకు లక్షల్లో అడ్వాన్సులు ఇచ్చి మరీ సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పందెం పుంజుల పెపకం దారులకు గిరాకీ పెరిగింది.

తీరంలో కోడి పందేలకు సై...?

ఈ ఏడాది కోడిపందేలను భారీగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో చిన్న చిన్న బరులే ఉండేవి. దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే పందేంరాయుళ్ళ సంఖ్య తక్కువగానే ఉండేది. అయితే ఈసారి సీన్ మారుతోంది. నాలుగు చోట్ల భారీ బరులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నలుగురు నిర్వాహకులు పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఒక బరి నిర్వాహకుడు మాత్రం పందేంరాయుళ్లను ఆకర్షించేందుకు దాదాపు రూ.50లక్షలు ఖర్చు పెట్టేందుకు సిద్ధం అవుతున్నట్టు సమాచారం. బయట ప్రాంతాల నుంచి దాదాపు పందెంరాయుళ్లను రప్పిం చడంతో పాటు పెద్ద ఎత్తున వినోద కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే పందెంరాయుళ్ళ కోసం ఇప్పటికే ఈ నిర్వాహకులు రూమ్‌లన్ని బుక్ చేసేశారు. మూడు ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇందులో బరిలతోపాటు వేదికలు, కార్ పార్కింగ్‌కు కూడా ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నిర్వాహకుడి ఏర్పాట్లను తెలుసుకున్న మిగిలిన ముగ్గురు దీటైనా ఏర్పాట్లకే సిద్ధమవుతున్నారు. ఇందులో ఒక బరిని పాలకొల్లు రోడ్, మరో బరి లక్ష్మణేశ్వరం, మరొకటి మొగల్తూరులో ఏర్పాట్లు జరగు తున్నాయి. గతంలో గ్రామాల్లో చిన్న చిన్న బరులు ఉండేవి. ఈసారి పెద్ద బరులు వస్తుండటంతో చిన్న బరులకు పందేంరాయుళ్లు వస్తారా లేదా అన్న సందేహం నిర్వాహకుల్లో నెలకొంది.

కోడి పందేల బరులు ధ్వంసం

ఏలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ గ్రామంలో గురువారం కోడి పందేల కోసం ఏర్పాటు చేసిన బరులను తహసీల్దారు సాయిరాజు, ఎస్‌ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సరదాగా రూ. కోటి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కోడి పందేలకు జిల్లాలో నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అతిథులు విచ్చేస్తున్నారు. పెద్ద మొత్తంలో పందేలు కాసేందుకు ఉబలాటపడుతున్నారు. తాడేపల్లిగూడెంలోని ఓ తోటలో నిర్వహించే బరికి ఇప్పటినుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కోడి పందేల్లో పేరుమోసిన ఓ యజమాని తన కోళ్లతో తాడేపల్లిగూడెం రావడానికి సన్నాహాలు చేసుకున్నారు. మూడు రోజులపాటు పాల్గొంటున్నారు. అతని పేరు రత్తయ్యగా ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎవరైనా సై అంటే మూడు రోజుల్లో ఒక పందాన్ని కోటి రూపాయల వరకు కాయనున్నట్టు ప్రకటించారు. ఎప్పటినుంచో తన మనస్సులో ఉన్న మాటను ఆయన బయట పెట్టారు. సొంత కోళ్లను పందేల కోసం పెంచుకుంటున్నారు. వాటితో తాడేపల్లిగూడెంలో పందేల కోసం రానున్నట్టు సోషల్ మీడియాలో ప్రకటించారు. అదే ఇప్పుడు పందెగాళ్లలో ఆసక్తి రేపుతోంది. మరోవైపు భీమవరం, ఉండి. గణపవరం, నర్సాపురం, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో భారీ బరలు వేసేందుకు కసరత్తు పూర్తయ్యింది.



మహిళా అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

1975 మంది అభ్యర్థుల అర్హత

ఏలూరు క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఖాళీగా ఉన్న 204 కానిస్టేబుళ్ళ పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు నోటిఫికేషన్ జారీ చేయడంతో గతంలోనే ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించారు. అందులో అర్హత సాధించిన 4976 మంది అభ్యర్థులకు హాల్‌టిక్కెట్లు జారీ చేశారు. వీరికి గతనెల 30వ తేదీ నుంచి ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, పోలీస్ అధికారులు కలిసి అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు, స్పోర్ట్స్ ఈవెంట్స్ గురువారం వరకు నిర్వహించారు. ఈ పరీక్షలకు 3453 మంది హాజరయ్యారు. వీరిలో 1975 మంది అర్హత సాధించారు. ఫైనల్ రాత పరీక్షను రిక్రూట్‌మెంట్‌బోర్డు ప్రకటించనుంది.

వచ్చే ఏడాదికి ఆక్వా యూనివర్శిటీ పనులు పూర్తి



ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులతో డీన్ డాక్టర్ సుగుణ

నరసాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సరిపల్లి గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఆక్వా యూనివర్శిటీని వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామని యూనివర్శిటీ డీన్ డాక్టర్ టి.సుగుణ అన్నారు. గురువారం సాయంత్రం లక్ష్మణేశ్వరం గ్రామంలోని తాత్కాలిక యూనివర్శిటీ భవనంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఆక్వా రంగంలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్న అవకాశా లను అందిపుచ్చుకోవాల న్నారు. డిగ్రీతో సరిపెట్టకుండా ఇదే కాలేజీలో పీజీ చేయా లన్న లక్ష్యంతో చదవాలన్నారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.ధనపాల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆక్వా సాగు విస్తరణ పెరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ రంగానికి ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తున్నాయమన్నారు. వీటితో పాటు ఆక్వా విద్యకు సంబంధించిన కాలే జీల సంఖ్య, కోర్సులను కూడా పెంచుతుం దన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల అసోసియేటెడ్ డీన్ డాక్టర్ కె.నీరజ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

బాలికపై అత్యాచారం

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాతూరుకు చెందిన రూపం పండు అదే ప్రాంతానికి చెందిన మైనర్ బాలికపై కన్నేశాడు. ఆ బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెను బెదిరించి పలు మార్లు అత్యాచారం చేశాడు. ఆ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించడంతో ఆమె భయపడి ఎవరికి చెప్పలేదు. బాలిక అనారోగ్యంగా ఉండటాన్ని గమనించిన తల్లి దండ్రులు ఆరాతీస్తే విషయం బయట పడింది. దీంతో బాలిక ఫిర్యాదు మేరకు రూపం పండుపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ సుబ్రహ్మణ్యం వివరించారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

పెంటపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : మీనవల్లూరు గ్రామానికి చెందిన చుండ్రు నరసింహమూర్తి(69) కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. వ్యాధికి సంబ oదించి చికిత్స కూడా చేయించుకుంటున్నాడు. ఇటీవల వ్యాధి బాగా ముదిరి పోవడంతో తాళలేక బుధవారం పొలం వెళ్తున్నానని ఇం ట్లో చెప్పి పొలం వద్ద ఉన్న గేదెల పాకలో పురుగుల మందు తాగేశాడు. మధ్యాహ్నం అయినా భోజనానికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్ళి చూడగా అస్వస్థతతో పడి ఉన్నాడు. తణుకులోని ఒక ప్రైవేటు ఆసుప త్రికి తరలించగా గురువారం మృతి చెం దాడు. మృతుని భార్య బేబి సరోజిని ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ స్వామి తెలిపారు.

ఆటోలో నగదు చోరీ

భీమవరం క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తన కుమార్తె ఇంటికి వెళ్ళడం కోసం ఆటోలో బయలుదేరిన ఒక మహిళ బ్యాగులో రూ. 1.50 లక్షల నగదు చోరీకి గురైంది. భీమవరం టూటౌన్ హెచ్‌సీ భూషణం తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన వేగిరాజు రామలక్ష్మి ఈ నెల 6వ తేదీన తన కుమార్తె ఇంటికి వెళ్ళడం కోసం బ్యాగులో రూ.1.50 లక్షల నగదు పెట్టుకుని బయలుదేరింది. భీమవరం ప్రకాశం చౌక్‌లో బస్సు దిగి ఆటో ఎక్కి అడ్డవంతెన దగ్గర దిగి కుమార్తె ఇంటికి వెళ్ళింది. అక్కడ బ్యాగ్ తెరచి చూసేసరికి రూ. 1.50 లక్షల నగదు కనిపించలేదు. దీంతో భీమవరం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ భూషణం తెలిపారు.



నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ శావణ్‌కుమార్

ముగ్గురు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

మూడు లక్షల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

భీమడోలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు, చేబ్రోలు, నర్సాపురం తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను భీమడోలు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ వివరాలు తెలిపారు. నెల్లూరు జిల్లా గూడూరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన రంగనాధం కిరణ్, ఎల్లుట్ల నారాయణమ్మ, ఎల్లుట్ల వసంతకుమార్‌లు అంతర్ జిల్లా దొంగలు. ఈ ముగ్గురిపై 58 పాత కేసులు ఉన్నాయి. ఇటీవల భీమడోలులో జరిగిన దొంగతనంపై కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా నిందితులు భీమడోలులో తిరుగాడుతున్నట్లుగా వచ్చిన సమాచారంతో భీమడోలు సీఐ విల్సన్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సుధాకర్, సిబ్బంది ఈ ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఐదు కేసులకు సంబంధించి దొంగతనాల్లో కాజేసిన సుమారు మూడు లక్షల రూపాయల వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనపర్చుకున్నారు. ప్రథమ ముద్దాయి రంగనాధం కిరణ్‌పై43, వసంత కుమార్‌పై7, నారాయణమ్మపై 8 కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.



గొరగనమూడి హైస్కూల్ వద్ద ధర్నా చేస్తున్న దళిత యువకులు

విగ్రహాల ఏర్పాటు.. వివాదాస్పదం

పాలకోడేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గొరగనమూడి హైస్కూల్ ప్రాంగణంలో విగ్రహాల ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. గొరగనమూడి హైస్కూల్ ప్రాంగణంలో కొన్ని రోజుల క్రితం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆ విగ్రహానికి ముందుగా స్వామి జ్ఞానానంద విగ్రహాన్ని, మూర్తిరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ఏర్పాట్లు చేపట్టారు. దీంతో ఆగ్రహించిన గ్రామానికి చెందిన దళితులు ఇదెక్కడి అన్యాయం.. అంబేడ్కర్ విగ్రహాన్ని కనిపించకుండా చేస్తారా అంటూ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమన్యాయం పాటించాలంటూ ధర్నా చేపట్టారు. దీంతో ఈ విషయం సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు దృష్టికి వెళ్ళడంతో ఆయన వివాదం సద్దుమణిగే విధంగా చర్చలు జరిపారు. అన్ని విగ్రహాలు ఒకే లైన్‌లో వచ్చేలా చర్యలు చేపట్టడంతో వివాదం సద్దుమణిగింది.

వేద పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య



కైకలూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తన కుమారుడిని వేద విద్యలో ఉన్నత స్థానంలోకి తీసుకు వెళ్లాలని వేద పాఠశాలలో చేర్పిస్తే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపరులను కంట తడి పెట్టించింది. కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామంలోని శివాలయంలో అర్చకుడైన కందుర్తి శివశ్రీ, ఛాయ దేవి దంపతుల కుమారుడు సాయిశివ సూరజ్ (19) బుధవారం రాత్రి వేదపాఠశాలలో ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగేళ్ళుగా గుంటూరుజిల్లా కోటప్పకొండలో తిరుమల తిరుపతి దేవ స్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేదవిజ్ఞాన పీఠంలో వేద విద్యను అభ్యసిస్తున్నాడు. వేదపాఠశాల లోని కొంతమంది వేధింపులు తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా స్థానికులు పేర్కొంటున్నారు. కుమా రుడి మరణవార్త విని గురువారం ఉదయం భుజబలపట్నంలో తల్లిదండ్రులు బోరున విలపించారు. అనంతరం బంధుమిత్రుల సహాయంతో కోటప్పకొండ వెళ్లి పోలీసులకు కుమారుడి మృతిపై ఫిర్యాదు చేశారు. అర్చ కుడు శివశ్రీ స్వగ్రామం కృష్ణాజిల్లా బంటు మిల్లి మండలం పెద్ద తుమ్మిడి గ్రామం. కుమారుడి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తీసుకు వెళ్లారు. భుజబలపట్నం గ్రామం నుంచి పలువురు పెద్దఎత్తున తరలివెళ్లి సంతాపం తెలియజేశారు.

మహిళ అనుమానాస్పద మృతి

భీమవరం క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒక మహిళ తాను ఉంటున్న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ ఏఎస్‌ఐ మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ప్రకాష్ నగర్‌కు చెందిన యాళ్ళ కృష్ణ కుమార్తె హరితపు రవీంద్రకుమారి (30) భర్త కుమార్‌ను వదిలి రాయలం గ్రామంలో ఒంటరిగా ఉంటుంది. గురువారం తెల్లవారుజామున తాను ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై ఆధారాలు సేకరిస్తున్నట్లు ఏఎస్‌ఐ మోహనరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

ఏలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) సందర్భంగా శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉత్తర ద్వార దర్శన కార్యక్రమం జరుగునని ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవి కుమారాచార్యులు గురువారం తెలిపారు. స్వామి వారు ఉత్తర ముఖంగా విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు.

● భీమడోలు: గుండుగొలను సీతారామ స్వామి ఆలయంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. తెల్లవారుజామున తీర్థపు బిందె, సుప్రభాత సేవ, అనంతరం ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని ఉదయం 8 గంటల సహస్ర తులసీదళార్చన, స్వామివారికి గరుడ వాహన సేవ నిర్వహిస్తామని తెలిపారు. ధనుర్మాసం పురస్కరించుకుని 13న భోగి పండుగ రోజున స్వామివారికి శేషవాహన సేవ, 14న సూర్య ప్రభ వాహన సేవలు జరుగుతాయన్నారు.

టీటీడీ తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

బుట్టాయగూడెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ క్యూలైన్ల వద్ద బుధవారం జరిగిన తొక్కిసలాటపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సురేష్, ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ తొక్కిసలాట ఘటనలో ఆరుగురి మృతికి పాలక మండలి బాధ్యత వహించాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు రూ.25 లక్షల పరిహారం అందించాలన్నారు. వైకుంఠ ఏకాదశి దర్శనాలకు తగిన సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. ఘటనకు బాధులను గుర్తించి అందరిపైన చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తుల మృతి బాధాకరం

ఏలూరు రూరల్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనలో భక్తులు మరణించడం బాధాకరమని, భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అధికారులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరిస్తే ఇటువంటి ఘటనలు జరగకుండా అవకాశం ఉంటుందన్నారు. ఎన్నడూ లేనివిధంగా తొక్కిసలాట జరిగి భక్తులు మరణించడం బాధాకరమన్నారు.

సెయింట్ థెరిసా మహిళా కళాశాలకు నాక్ ఎ ప్లస్

ఏలూరు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సెయింట్ థెరిసా అటానమస్ మహిళా కళాశాలకు ప్రభుత్వ గుర్తింపు 'నాక్-ఎ ప్లస్' నిర్ధారిస్తూ బెంగళూరులోని సంస్థ అధికారిక పత్రాలను గురువారం పంపింది. వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ స్థానిక మీడియాకు తెలియజేశారు. ఈ గుర్తింపు వున్న విద్యాసంస్థలకు యూజీసీ నిధులు సమకూర్చుతుందన్నారు.

కోడిపందేలు, జూదం అడ్డుకోవాలి

ఏలూరు రూరల్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముసుగులో జరిగే కోడి పందేలు, జూదం ఏర్పాట్లను అడ్డుకోవాలని ఘంటశాల వెంకటలక్ష్మి కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఎక్కడా కోడిపందేలు, జూదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కోడిపందేలతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు.

టీడీపీ నేత నాగేశ్వరరావు మృతి



చింతలపూడి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ ఎర్రంపల్లి పాకనాటి నాగేశ్వరరావు(62) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, పలువురు నేతలు, కార్యకర్తలు నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహనాలను స్వాధీనం చేసుకుని వాటిల్లోని సుమారు 15 వేల కిలోల చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించామన్నారు. వాహన యజమానులు, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

21 మంది బైండోవర్

జీలుగుమిల్లి, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు నిర్వహిస్తే తగిన చర్యలు తప్పవని ఎస్సై పి.నవీన్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం 21 మందిని బైండోవర్ చేశామన్నారు. సంక్రాంతికి పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

సారా కేసులో ఇద్దరి బైండోవర్

చింతలపూడి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ దాడుల్లో రేచర్లకు చెందిన ఎం.లక్ష్మీదేవి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఆమెతో పాటు నాగిరెడ్డిగూడెంకు చెందిన వి.లక్ష్మణుడును తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.



ఏలూరు జడ్పీ హైస్కూల్‌లో ముగ్గుల సందడి



పోలవరం మండలం గూటాలలో భోగి మంట వద్ద సందడి



పెదవేగిలో చిన్నారులకు భోగిపళ్లు వేస్తున్న ఉపాధ్యాయులు

సంక్రాంతి సంబరం

పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల ముందస్తు వేడుకలు

ఏలూరు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు కావడంతో గురువారం పలు పాఠశాల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. పుష్ప లీలానగర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు భోగిపళ్ళు పోసి ఆశీర్వదించారు. పతంగుల పోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం సూర్యప్రకాశరావు, టీచర్లు రాము, రాదిక, భాగ్యలక్ష్మి, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు, గంగిరెడ్ల విన్యాసాలు, పల్లె గేయాలు, సంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు, సంగీతవిభావరి జరిగాయి. హెచ్‌ఎం వెంకటరమణ, టీచర్లు నీలిమ, నిర్మలకుమారి, శ్రీనివాస్, సత్యనారాయణ, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు. ఇందిరాకాలనీ స్కూలు పిల్లలు భోగిమంటలతో ఉల్లాసంగా గడిపారు. శ్రీశర్వాణి స్కూలులో చిన్నపిల్లలకు భోగిపళ్ళుపోసి, బొమ్మలకొలువులు, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఉషా గ్రూప్స్ అధినేత వి.వి.బాలకృష్ణారావు, హెచ్‌ఎం సత్యశారద, డైరెక్టర్ మదనమోహనరాజు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఏలూరు నగరశాఖ ఆధ్వర్యంలో ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శుక్రవారం కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు కె.నాని తెలిపారు. తెలుగు అధ్యాపకుడు ప్రేమ్‌కుమార్, పీడీఎస్‌యూ నాయకులు యశ్వంత్, సునీల్‌కుమార్, శాంతికిరణ్, చందన్, లీలాకుమారి, కీర్తన, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: నగరంలోని ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. శనివారం పేట, శ్రీరామ్‌నగర్‌లో శ్రీశ్రీ విద్యా సంస్థల ఆవరణలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంవీఎస్ శర్మ జ్యోతి ప్రజ్వలనతో సంబరాలు ప్రారంభించారు. చిన్నారుల సాంప్రదాయ వేషధారణ, గాలిపటాల ఎగురవేత, గొబ్బెమ్మలు తదితర కార్యక్రమాలు అలరించాయి. సీహెచ్ దివ్య, వి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. శ్రీరామ్ నగర్ జింగిల్‌బెల్స్ పాఠశాల విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో అలరించారు. ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు: పోలవరం మండలం గూటాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామ కార్యదర్శి తాతి విజయకుమారి, ఉప సర్పంచ్ కరిబండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భోగి మంట వేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

● పెదవేగి: లక్ష్మీపురం హైస్కూల్ విద్యార్థులు సంక్రాంతి సందడి చేశారు. హరిదాసుల హరినామ కీర్తనలు, చిన్నారులకు భోగిపండ్లు, పాఠశాల ఆవరణలో రంగవల్లులు, గొబ్బెమ్మలు, డూడూ బసవన్నల వాయిద్యాలతో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బోయపాటి వెంకటేశ్వరరావు, సాయిబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏలూరు: జంగారెడ్డిగూడెం పట్టణంలో వ్యాయామం, యోగా, క్రీడల అభివృద్ధికి సహకరిస్తామని క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ అన్నారు. అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్కులో ఆరోగ్య అభిలాష, సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. భోగిమంటలు, రంగవల్లులు, గంగిరెద్దు విన్యాసాలు, హరిదాసు కీర్తనలు అలరించాయి. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, గోరింట విజయరామరాజు, ముదునూరి నరసింహరాజు, గొట్టుముక్కల భాస్కరరాజు, తదితరులు పాల్గొన్నారు. లక్కవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలతో భోగి మంటలు చుట్టూ తిరుగుతూ అలరించారు. ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ ఛైర్మన్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: బండివారిగూడెం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నాళం నారాయణరావు నగదు బహుమతి అందజేశారు. హెచ్‌ఎం డి.బాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభయ ప్రచార వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అభయ రక్షకదళం ప్రయోజనాలు వివరించే ప్రచార వాహనాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమని జేసీ పి.ధాత్రిరెడ్డి అన్నారు. బాలికలు, మహిళలు, వయోవృద్ధులకు రక్షణ కల్పించడానికి ఏర్పాటుచేసిన అభయపై ప్రచార వాహనాన్ని ఎస్పీ కేపీఎస్.కిశోర్ ఏర్పాటు చేశారు. అమీనాపేట సురేష్‌చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం స్కూలులో గురువారం జరిగిన కార్యక్రమంలో జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు విద్యార్థులు తమవంతు బాధ్యత వహించాల న్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 112, 1098, సైబర్ నేరమైతే 1930 నెంబర్లకు తెలియజేయాలని సూచించారు. ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ జిల్లాలో బాలికలు, మహిళలు, వృద్ధుల రక్షణకు అభయ మహిళా రక్షక దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ఈ వాహనం ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహలు అరికట్టేందుకు, అనర్థాలను తెలియజేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ వాహనాన్ని ఎస్పీ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి విద్యార్థులతో కలిసి జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, మహిళా స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్‌ఐ కాంతిప్రియ, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

సొమ్ము చెల్లించేవరకు పోరాడుతాం



నిరసన వ్యక్తంచేస్తున్న కొల్లేటి లంక వాసులు

పెదవేగి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కొండలరావుపాలెంలోని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద కొల్లేటి లంకగ్రామస్తుల ఆందోళన గురువారం కొనసాగింది. తమ సొమ్ము తీసుకునే వరకు ఆందోళన ఆపేది లేదని లంక గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆయా గ్రామాల నాయకులు మాట్లాడుతూ కొఠారు అబ్బయ్య చౌదరి 2019- 24 సంవత్సరాల మధ్య అధికారాన్ని అడ్డుపెట్టుకుని మా చెరువుల ఆదాయాన్ని బొక్కేశారన్నారు. కౌలు సొమ్ము ఇస్తామని తనచుట్టూ తిప్పుకుని, ఆపై తండ్రీ, కొడుకులిద్దరూ ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సొమ్ము ఇచ్చేవరకు వదిలిపెట్టబోమని, ఎన్ని కష్టాలు ఎదురైనా ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతల రవి, సైదు సత్యనారాయణ, అర్జియ్య, కొరపాటి రఘురామయ్య, ఘంటసాల నాగరాజు, జయమంగళ బాలకృష్ణ, బలే చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పీసా ఎన్నికలు ఏకగ్రీవం.. మరికొన్ని వాయిదా

ఏలూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలో మామిడిగొంది, గార్యగొయ్యి, గుంజవరం గ్రామాల్లో పీసా ఎన్నికలు గురువారం ఏకగ్రీవమయ్యాయి. ప్రగడపల్లి, రేపల్లెవాడ, శివగిరి, ఎల్‌ఎన్‌డీపేట, కోండ్రుకోట, కొత్తమామిడిగొంది గ్రామాల్లో కోరం లేక వాయిదా పడ్డాయి. ఎంపీడీవో ఈ.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో పీసా ఎన్నికల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయించిన తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. పీసా ఎన్నికలకు తమ గ్రామానికి చెందిన వారినే ఎన్నుకోవాలని దేవరగొంది గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బొరగంవెంకటలక్ష్మి, కె.రమేష్, బీవీ.భద్రరావు, ఎం.రమేష్, టి.వనిత, కంగాల కన్నయ్య పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: పంచాయతీ వద్ద పీసా గ్రామసభ పెట్టాలని లక్ష్మగూడెంకు చెందిన గిరిజనులు గ్రామసభకు హాజరు కాలేదు. కంగాలవారిగూడెంలో జరగవలసిన పీసా గ్రామసభ వాయిదా పడింది. లక్ష్మడుగూడెం పంచాయతీ కార్యాలయానికి కేంద్రంగా ఉంటే కంగాలవారిగూడెంలో గ్రామసభ ఎలా పెడతారని గిరిజనులు హాజరు కాకపోవడంతో ఎన్నిక నిలిచిపోయింది. ముద్దప్పగూడెం, పులిరాముడుగూడెం, నిమ్మలగూడెం, చింతలగూడెం, కొమ్ముగూడెం గ్రామాల్లో గ్రామసభలు కోరం లేక నిలిచిపోయినట్లు ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. ఈ నెల 10న తిరిగి పీసా గ్రామసభ నిర్వహించనున్నట్లు అన్ని గ్రామాలకు ముందస్తు సమాచారం ఇచ్చామన్నారు.

● జీలుగుమిల్లి: కొత్తచీమలవారిగూడెం, బర్రింకలపాడు, వంకవారిగూడెంలో పీసా ఎన్నికలు నిర్వహించినట్లు అధికారులు ఎంఈవో -2 ఎస్.బుచ్చయ్య, ఈవోపీఆర్డీ నిఖిల్ మధుశరణ్ చెప్పారు. చీమలవారిగూడెం ఉపాధ్యక్షుడిగా నారం మల్లేశ్వరావు, కార్యదర్శిగా కారం రవిని ఎన్నుకున్నారు. బర్రింకలపాడులో ఉపాధ్యక్షుడిగా పొట్టా కామరాజు, కార్యదర్శిగా కుంజా భీముడు ఎన్నికయ్యారు, వంకవారిగూడెంలో స్థానికులు కొందరు అప్పటి వరకు ఎన్నికల నిర్వహణ వద్ద ఉండి సంతకాలు పెట్టేందుకు లేకుండా బయటకు వెళ్లి పోవడంతో పీసా ఎన్నిలు వాయిదవా పడినట్లు ఎన్నికల అధికారి ఎంఈవో కె.శ్రీనివాస్ చెప్పారు.

వ్యాధులపై అవగాహన అవసరం

లింగపాలెం, జనవరి9 (ఆంధ్రజ్యోతి): దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. రంగాపురం పాఠశాలలో గురువారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ ఎన్.ప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు దోమల వలన వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. ఆరోగ్యంపై విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం హేమలత, జ్యోతి, పలువురు ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబైన శ్రీవారి క్షేత్రం

(3వ పేజీ తరువాయి)

యంత్రాంగాన్ని పెంచామని ఆలయ ఈఈ భాస్కర్ తెలిపారు. డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో సెక్యూరిటీ విభాగం పనిచేస్తుందని వివరించారు. క్యూలైన్ల పొడవు పెంచామన్నారు. వాటిని పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 40 నుంచి 50 వేలకు పైబడి భక్తులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు. వారికి అన్ని తగిన సౌకర్యాలు కలిగేలా ఏర్పాట్లు చేసామన్నారు. క్యూలైన్లలో మంచినీరు, పాలు, మజ్జిగ అల్పాహారాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 12 తాత్కాలిక టాయిలెట్లను నిర్మించామన్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు శీఘ్రంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఆలయంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఇతర పోలీసు అధికారులు పరిశీలించి ఈఈ భాస్కర్‌తో చర్చించారు. పోలీస్ యంత్రాంగాన్ని పెంచుతున్నామని పకడ్బందీగా ఉత్తర ద్వారదర్శనం భక్తులందరూ వీక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

పీఎంశ్రీ పాఠశాలల స్కౌట్స్, గైడ్స్ టీచర్లకు పరీక్ష



మదింపు పరీక్ష రాస్తున్న స్కౌట్స్, గైడ్స్ టీచర్లు

ఏలూరు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకానికి ఎంపికైన హైస్కూల్స్‌లో యూనిట్లను ప్రారంభించాలని స్కౌట్స్ గైడ్స్ జిల్లా కార్యదర్శి బాస్కర్‌కుమార్ సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల స్కౌట్స్ గైడ్స్ ఉపాధ్యాయులకు ప్రథమ చికిత్స, సిగ్నలింగ్, కుకింగ్, కంపాస్, ఎస్టిమేషన్, హైక్ మార్చ్‌పాస్ట్ తదితర అంశాల్లో వారం రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. శిక్షణ అనంతరం పాఠశాలల్లో బాలురకు స్కౌట్, బాలికలకు గైడ్ యూనిట్లను ప్రారంభించి, అకడమిక్ కేలండర్ ప్రకారం తరగతులు నిర్వహించాలన్నారు. ఒక్కో పాఠశాలకు రూ.40లక్షల విలువైన సైన్స్ పరికరాలు, క్రీడాప్రాంగణం అభివృద్ధి, విద్యార్థులకు యూనిఫాం కేంద్ర ప్రభుత్వం ఖర్చుచేస్తుందన్నారు. శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులకు మదింపు పరీక్షను నిర్వహించారు. క్యాంప్ ఆఫీసర్ ప్రసాద్, ఎల్‌వోసీలు ధనలక్ష్మి, పద్మ, ట్రైనర్లు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, చాంద్‌బీబీ, సౌజన్య, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర చట్టబద్ధం చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

ఏలూరు రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతు పంటలకు మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టబద్ధం చేయాలని, సాగు భూములకు రైతు భరోసా ఒకేసారి ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కె గౌస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ కమిటీ కన్వీనర్ కె.రంగారెడ్డి మాట్లాడారు. రైతు పంటలకు ఎంఎస్‌పీ చట్టబద్ధం చేయాలని ఢిల్లీలో రైతు ఉద్యమం చేసినట్లు తెలిపారు. వ్యవసాయ నల్లచట్టాలను రైతు ఉద్యమం ఫలితంగా రద్దు చేసి, మరో రూపంలో నూతన మార్కెట్ చట్టాన్ని తీసుకొచ్చి కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. రైతు రుణమాఫీ సమగ్రంగా అమలు చేయాలని ఉపాధి హామీలో 200 రోజుల పని, రోజుకు 600 వేతనం చెల్లించాలని, అటవీ హక్కుల చట్టం సమగ్రంగా అమలు చేసి పోలవరం ముంపు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి చంద్రరావు, పెద్ద సంఖ్యలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య వర్కర్లను పెంచాలి

ఏలూరుటూటౌన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్నారని, వర్కర్లను పెంచాల్సిన అవసరం ఉందని ఏపీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సోమయ్య డిమాండ్ చేశారు. 7వ డివిజన్ విస్తీర్ణం చాలా ఎక్కువ కాగా 29 మంది వర్కర్లు ఉన్నారన్నారు. మరో 15మందిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏరియాలో ఎమ్మెల్యే, మేయర్, మాజీ ఎమ్మెల్యే ఆఫీస్, కార్యాలయాలు ఉన్నాయన్నారు. మార్కెట్లు, బ్యాంక్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు ఎక్కువగా ఉన్నాయన్నారు. పారిశుధ్య కార్మికులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

సీపీఐ కార్యాలయాన్ని నిర్మించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాలు

ఏలూరు రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బుట్టాయిగూడెం మండల సీపీఐ కార్యాలయాన్ని కూల్చివేసిన బాధ్యులే పునర్‌నిర్మించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బుట్టాయిగూడెంలో సీపీఐ కార్యాలయం కూల్చివేత దుర్మార్గం అన్నారు. అక్కడ తహసీల్దార్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి నోటీస్ లేకుండా పోలీస్ సిబ్బందితో కూల్చివేయడం అప్రజాస్వామికం అన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కుట్రపూరితంగా కూల్చివేయడం సిగ్గు చేటు అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి మున్నీర్, బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమచందర్, పుప్పాల కన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేసిన ఎస్టీయూ నేతలు

చింతలపూడి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంటపల్లి, సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ఎస్టీయూ ఏపీ జిల్లా అధ్యక్షుడు ఎం.శామ్యూల్ గురువారం అందజేశారు. నిపుణులతో రాష్ట్ర సంఘం మెటీరియల్ రూపొందించిందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యు.ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పి.సుధాకరరావు, జిల్లా కౌన్సిలర్ సత్యనారాయణ, నాగేశు పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్: స్థానిక మౌలానా అబుల్ కలాం అజాద్ (మాకా) ఉర్దూ హైస్కూలు, అశోకవర్ధన ప్రాథమిక పాఠశాల, తంగెళ్ళమూడి, మున్సిపల్ ఉన్నతపాఠశాలల్లో పదో విద్యార్థులకు యూటీఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎంలు ఖాజిదా బేగం, పార్వతి, హైమావతి, షఫ్రక్ గురువారం పంపిణీ చేశారు. షేక్‌పర్వీన్ బేగం, ఎండి జకిరియా, రాజారావు, కిరణ్‌కుమార్, అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

కుక్కునూరు: ఆశ్రం బాలికల పాఠశాల విద్యార్థులకు జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్, నవీన గురువారం నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఇటీవల విద్యార్థులకు నోటు పుస్తకాలు కావాలని పాఠశాల హెచ్‌ఎం మంగమ్మ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వెంటనే స్పందించి 500 పుస్తకాలు పంపిణీకి చర్యలు తీసుకున్నారు. కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

ఇంటర్వ్యూ..

కాల్వల అభివృద్ధికి కృషి



గంధం లక్ష్మణకుమార్, ఛైర్మన్, భీమడోలు డీసీ

● డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్‌గా మీరు చేపట్టే చర్యలు ఏమిటి?

ఏలూరు గోదావరి కాలువ అభివృద్ధితో పాటు ఈ కాలువ నుంచి వెళ్ళే మైనర్ కాలువల పటిష్టతకు కృషి చేస్తాం.

● మీ పరిధిలో కాలువ పరిస్థితి?

పూళ్ళ నుంచి గుండుగొలను వరకూ ఉన్న ప్రధాన ఏలూరు గోదావరి కాలువలో గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయింది. దీనిని తొలగించి నీటి పారుదల సక్రమంగా జరిగేలా పనిచేస్తా.

● ప్రధాన సమస్యలు ఏమిటి?

డీసీ పరిధిలో పనిచేస్తున్న ఇరిగేషన్ లస్కర్లకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి చెల్లింపునకు కృషి చేస్తా. సిబ్బంది కొరతను తీర్చేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా.

● కొల్లేరు డ్రైయిన్ల పరిస్థితి ఏమిటి?

పూళ్ళ నుంచి ఎంఎంపురం వెళ్ళే పుప్పాల వారి కోడు, వాల్ కోడుతో పాటు పంట కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోయింది. దానిని తొలగిస్తాం. పంట కాలువల గట్లపై చెట్లను, మొక్కలను తొలగించి పనులు చేపడతాం.

భీమడోలు, ఆంధ్రజ్యోతి



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కంప్యూటర్ విద్యలో నైపుణ్యం సాధించాలి

ఏలూరు టూటౌన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించుకుని విద్యార్థులు కంప్యూటర్ విద్యలో నైపుణ్యం సాధించాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కస్తూరిబా బాలికోన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు 11 కంప్యూటర్లు బహుకరించింది. ల్యాబ్‌ను ఎమ్మెల్యే చంటి గురువారం ప్రారంభించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను విద్యార్థులు వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. చోడే వెంకటరత్నం, పెద్దిబోయిన శివప్రసాద్, తిరుపతి, హెచ్‌ఎం జీ.సునీత, ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, మనీష్‌రాజు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎంపీ మహేశ్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కొయ్యలగూడెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొంగుటూరు, చొప్పరామన్నగూడెం గ్రామాలకు చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్‌లను ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ గురువారం అందజేశారు. ఏలూరులోని ఎంపీ కార్యాలయంలో చెక్కులను అందజేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ తెలిపారు. పొంగుటూరుకు చెందిన మర్రి శామ్యూల్, చొప్పరామన్నగూడెం గ్రామానికి చెందిన నల్లూరి మౌనికకు సుమారు రూ.లక్షా 20వేలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రగడా రమేష్, నల్లూరి గోపి, త్రిమూర్తులు, తదితరులు ఉన్నారు.



కూరగాయలు ఇచ్చిన దాతలు

అన్నదాన ట్రస్ట్‌కు లారీ లోడు కూరగాయలు వితరణ

ద్వారకాతిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాత లారీ కూరగాయలను విరాళంగా గురువారం అందజేశారు. విజయవాడకు చెందిన బడేటి శ్రీనివాసరావు తదితరులు కూరగాయలను అన్నదాన భవనంలో అధికారులకు అప్పగించారు. ముక్కోటి సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదంలో వినియోగించాలని కోరారు. ఆరేళ్లుగా నిత్యాన్నదానానికి కూరగాయలు అందజేస్తున్నట్లు దాత శ్రీనివాసరావు తెలిపారు.

ఫకీర్ సాహెబ్‌కు పరిహారం అందిస్తాం

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

కుక్కునూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కుక్కునూరుకు చెందిన షేక్ ఫకీర్ సాహెబ్‌కు పోలవరం పరిహారం అందించే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పరిహారం అందుకునే లబ్ధిదారులు కొందలు మృతి చెందడంతో ఇతడిని కూడా ఆ జాబితాలో చేర్చారు. 'బతికుండగానే చంపేశారు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై తహసీల్దార్ రమేష్‌బాబు వెంటనే స్పందించారు. పకీర్ సాహెబ్‌ను కార్యాలయానికి పిలిపించి విచారించారు. రెండు రోజుల్లో పరిహారం అందజేసేలా కృషి చేస్తానని హామీఇచ్చారు.

అన్నదాతపై ఆర్థిక భారం

కర్కశంగా వ్యవహరిస్తున్న బ్యాంకులు : మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు



సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, అత్తులూరి విగ్రహావిష్కరణ

చాట్రాయి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు రైతులపై కర్కశంగా వ్యవహరిస్తున్నాయని, బడా కార్పొరేట్ సంస్థల ఉదారంగా వ్యవహరించడం అన్యాయమని విజయవాడ మాజీ ఎంపీ, రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. చిన్నంపేటలో గురువారం టీడీపీ నేత దివంగత అత్తులూరి నరసింహారావు సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి కారణాల వల్ల అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. కౌలు రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు అందడం లేదని, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలను అప్పులు తెచ్చి తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరం అన్నారు. రైతులకు అండగా ఉండాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయన వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అత్తులూరి శ్రీనివాసరావు, మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, తల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నరసింహారావు విగ్రహావిష్కరణ

మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు దివంగత అత్తులూరి నరసింహారావు విగ్రహాన్ని చిన్నంపేట సెంటర్‌లో వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయన వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. సుమారు 60 ఏళ్ళ పాటు పేదల రక్షణ, సంక్షేమం కోసం, టీడీపీ బలోపేతానికి ఆయన చేసి కృషిని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నేత హరనాథ్, టీడీపీ నాయకులు అత్తులూరి శ్రీనివాసరావు, సూర్యనారాయణ, బొట్టు రామచంద్రరావు, నోబుల్‌రెడ్డి, బుచ్చిబాబు, కందుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

ముసునూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖాధికారి సుబ్బారావు అన్నారు. గురువారం గోపవరం జడ్పీపాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడినా వంట ఏజన్సీలను రద్దు చేస్తామని హెచ్చరించారు. హెచ్‌ఎం నాగేంద్రరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎన్‌ఆర్‌ఐ విద్యార్థి



జూడోకు ఎంపికైన వంశీ సాగర్

ఆగిరిపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పోతవరప్పాడు ఎన్‌ఆర్‌ఐ కళాశాల ఎంబీఏ విద్యార్థి వంశీసాగర్ జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యాడు. మధ్యప్రదేశ్‌లో ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ప్రతిభ కనబరిచి పంజాబ్‌లో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ జూడో పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభ కనబరిచిన నాగ వంశీని కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, ఏవో ఎస్.మాధవరావు, తదితరులు అభినందించారు.

చనుబండలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు

చాట్రాయి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అపర భద్రాద్రిగా పేరు గాంచిన చనుబండ కోదండరామస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. చుట్టు పక్కల మండలాలు, సరిహద్దు తెలంగాణ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో ఏర్పాట్లు చేశారు.

ముస్తాబైన శ్రీవారి క్షేత్రం

(3వ పేజీ తరువాయి)

యంత్రాంగాన్ని పెంచామని ఆలయ ఈఈ భాస్కర్ తెలిపారు. డీఎస్పీ స్థాయి అధి కారి పర్యవేక్షణలో సెక్యూరిటీ విభాగం పనిచేస్తుందని వివరించారు. క్యూలైన్ల పొడవు పెంచామన్నారు. వాటిని పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 40 నుంచి 50 వేలకు పైబడి భక్తులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు. వారికి తగిన సౌకర్యాలు కలిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. క్యూలైన్లలో మంచి నీరు, పాలు, మజ్జిగ అల్పాహారాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 12 తాత్కాలిక టాయిలెట్లను నిర్మించామన్నారు. భక్తులకు శీఘ్రంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఆలయంలో భద్రత ఏర్పాట్లను ఎస్పీ కిశోర్, ఇతర పోలీసు అధికారులు పరిశీలించి ఈఈ భాస్కర్‌తో చర్చించారు. పోలీస్ యంత్రాంగాన్ని పెంచుతున్నామని పకడ్బందీగా ఉత్తర ద్వారదర్శనం భక్తులందరూ వీక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

శ్రీనివాసా..గోవిందా !

ద్వారకాతిరుమలలో వైభవంగా గిరిప్రదక్షిణ

ద్వారకాతిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో గురువారం జరిగిన గిరిప్రదక్షిణతో శేషాచల పరిసరాలు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాయి. శ్రీనివాసా గోవిందా...శ్రీ వేంకటేశా గోవిందా...ఆపద్బాంధవ గోవిందా.. అంటూ భక్తులు ఆలయ తొలిమెట్టు వద్ద ముందుగా భజనలు చేశారు. అలంకరించిన ధర్మప్రచార రథంలో కొలువైన శ్రీవారి దివ్యమూర్తులకు ఆలయ ధర్మకర్త ఎస్‌వీ నివృతరావు, ఈవో వేంద్ర త్రినాథరావు దంపతులు రథం ముందు బలిహరణ సమర్పించి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, కోలాట ప్రదర్శ నలు, కేరళ వాయిద్యాలు, తీన్‌మార్‌ల నడుమ గజ, వృషభ, అశ్వాలు ప్రచారరథం ముందు నడుస్తుండగా అశేష జనవాహినితో జరిగిన ఈ గిరిప్రదక్షిణతో రహదారులు కిక్కిరిశాయి. ఆలయం వద్ద ధనుర్మాస మండపం వద్ద ప్రారంభమై కొత్త బస్టాండ్, దొరసానిపాడు, రాళ్లకుంట, శేషాచల ఘాట్ రోడ్డు, ఉగాది మండపం మీదుగా 6కి.మీ మేర అంగరంగ వైభవంగా తిరిగి ఆలయానికి చేరుకుంది. మార్గమధ్యలో భక్తులకు దాతల సహకారంతో పండ్లు, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ భవనాలు

భయం.. భయం..

శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగం

అసాంఘిక కార్యకలాపాలు.. పాములకు నిలయం



శిథిలావస్థలో ఉన్న ఎన్‌ఎస్‌పీ భవనాలు

ముసునూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జునాసాగర్ ప్రాజెక్టు (ఎన్‌ఎస్‌పీ) భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఆ ప్రాంతం చిట్టడవిని తలపిస్తోంది. అటువైపు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. అసాంఘిక కార్యకలాపాలకు, విషసర్పాలకు నిలయంగా మారాయి. పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. నాగార్జున సాగర్ ఎడమకాలువ తవ్వకం పనుల సందర్భంగా అధికారుల కోసం గ్రామం నడిబొడ్డున సుమారు 3ఎకరాల స్థలంలో క్వార్టర్స్ నిర్మించారు. పనులు పూర్తికాగానే సంబంధిత కార్యాలయాన్ని నూజివీడులో ఏర్పాటు చేయడంతో అధికారులు వెళ్లిపోయారు. సుమారు పదేళ్ల నుంచి క్వార్టర్స్ ఖాళీగా ఉండడం, అధికారులు పట్టించుకోకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరాయి. క్వార్టర్స్ ఆవరణలో పుట్టలు, చెట్లు పెరిగి విష సర్పాలకు ఆవాసంగా మారాయి. చుట్టుపక్కల ఇళ్ళలోకి రాత్రి సమయాల్లో విషసర్పాలు వెళ్లడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల ముగ్గురు పాముకాటు నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. శిథిల భవనాల్లో రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. జనావాసాల మధ్య నిరుపయోగ భవనాలను తొలగించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

వ్యవసాయ గోదాములు నిర్మించండి

నిరుపయోగ ఎన్‌ఎస్‌పీ భవనాలను తొలగించి వ్యవసాయ గోదాములు నిర్మించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలో ఒక్క వ్యవసాయ గోదాము లేక వర్షాకాలం పంట కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. రైతు సంఘాల నాయకులు గోదాములు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం అయినా ఈ భవనాలను తొలగించి రైతులకు ఉపయుక్తంగా ఉండే గోదాములు నిర్మించాలని రైతులు కోరారు.



పాములు.. పురుగుల సంచారం

క్వార్టర్స్ ఆవరణలో పుట్టలు పేరుకుని పాములు, పురుగులు పెరిగాయి. రాత్రి వేళ పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. శిథిల భవనాలు తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

- మంగిశెట్టి పవన్‌కుమార్, ముసునూరు

రైతులకు మేలు చేయవచ్చు

మండలంలో వ్యవసాయ గోదాములు లేవు. శిథిలా వస్థ భవనాలు తొలగించి వ్యవసాయ గోదాములు నిర్మించాలని విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేదు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- రాయంకుల లక్ష్మణరావు, రైతుసంఘం నేత



చెల్లని చెక్ కేసులో ఆరు నెలలు జైలు శిక్ష

నూజివీడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్ కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.35 లక్షలు జరిమానా విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయాధికారి వేల్పుల కృష్ణమూర్తి తీర్పు ఇచ్చారు. బాపులపాడు మండలం సీతారాంపురానికి చెందిన పూర్ణచంద్రరావు నిడమానూరుకు చెందిన బేబీ సరోజినికి దఫదఫాలుగా రూ.30 లక్షలు అప్పు ఇచ్చారు. బాకీ తీర్మానం నిమిత్తం 2017లో బేబీ సరోజిని రూ.10 లక్షలు చొప్పున మూడు చెక్కులను పూర్ణచంద్రరావుకు ఇవ్వగా బ్యాంకులో నగదు లేదని చెక్కులు తిరిగి వచ్చాయి. పూర్ణచంద్రరావు కోర్టును ఆశ్రయించగా విచారించిన న్యాయాధికారి నిందితురాలికి ఆరునెలల జైలు శిక్ష, ఆమె చెల్లించాల్సిన రూ.30 లక్షలతో పాటు అదనంగా రూ.5 లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం శివారు నాగేంద్రపురంలో గురువారం పేకాట శిబిరంపై ఎస్‌ఐ ఎం.చిరంజీవి, సిబ్బంది దాడి చేశారు. ఇద్దరు పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ 1860 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



కొత్తగూడెంలో సంప్రదాయ దుస్తుల్లో ఉపాధ్యాయులు, స్థానికులు

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

చాట్రాయి, జనవరి 9 (ఆంధ్యజ్యోతి): కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో మర్లపాలెం కాంప్లెక్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. స్కూల్ ఆవరణ రంగవల్లులతో తీర్చిదిద్దారు. ఎంఈవో బ్రహ్మచారి భోగిమంటలు వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరవడంతో పండుగ వాతావరణం ఉట్టి పడింది. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు చిన్నారులకు భోగి పళ్ల పోశారు. హరిదాసు కీర్తనలు, విద్యార్థినుల కోలాటం, విద్యార్థుల నృత్య ప్రదర్శనతో అలరించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. బాలల సందడితో సంక్రాంతి ముందే వచ్చింది. హెచ్‌ఎంలు నరసింహారావు, బక్కయ్య, సర్పంచ్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు పాఠశాలలో

నూజివీడు టౌన్: భారతీయ సంప్రదాయ పండుగలపై భావితరాలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో నూజివీడు త్రివిధ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు వాలుజడ, ఓణీలు ధరించి సంప్రదాయ ప్రదర్శన నిర్వహించారు. శ్రీకృష్ణుడు రుక్మిణి వేషధారణ, వేంకటేశ్వర కల్యాణం ప్రదర్శన సభికులను మంత్రముగ్ధులను చేశాయి. ముగ్గులు, గొబ్బెమ్మలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

అగ్రిస్టాగ్‌తో భూముల డిజిటలైజేషన్



ఆలూరి చాముండేశ్వరి
మండల వ్యవసాయాధికారి

● **కేంద్రం చేపట్టిన అగ్రిస్టాగ్ రైతులకు ఏవిధంగా ఉపయోగపడుతుంది?**

భూముల డిజిటలైజేషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 14 అంకెల అగ్రిస్టాగ్‌ను ఇస్తోంది. సుప్రీంకోర్టు రైతుల ఆధార్‌ను ఎక్స్‌పోజ్ చేయవద్దని ఇచ్చిన సూచనల నేపథ్యంలో 14 అంకెల నంబర్ ఇస్తారు. రైతులకు ప్రభుత్వ రాయితీలను అందించేందుకు ప్రతి భూమికి అగ్రిస్టాగ్‌ను ఇవ్వడం జరుగుతోంది.

● **అగ్రిస్టాగ్ పొందడం ఎలా..?**

రైతులు ఆన్‌లైన్ 1(బి), ఆధార్‌తో లింక్‌అయిన మొబైల్‌నంబర్‌తో రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలి. భవిష్యత్‌లో పీఎం కిసాన్ ద్వారా వచ్చే నిధులు అగ్రిస్టాగ్ ఉంటేనే విడుదల అవుతాయి.

● **మండలంలో ధాన్యం సేకరణ?**

మండలంలో 4,230 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం. ఇప్పటివరకు 703మంది రైతుల నుంచి 91,429 బస్తాల ద్వారా 3,657 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగింది.

● **మొక్కజొన్న రైతులు, విత్తన కంపెనీల ఒప్పందాల పరిస్థితి..?**

నూజివీడు మండలంలో 2,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. వెయ్యి ఎకరాలు కమర్షియల్ మొక్కజొన్న కాగా, 1500 ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న సాగవుతోంది. విత్తన రైతులు నేరుగా కంపెనీ ఆర్గనైజర్లతో ఐదుఅంశాలతో ఒప్పందాన్ని కుదుర్చుకోమని చెప్పాం.

నూజివీడు టౌన్, ఆంధ్రజ్యోతి

నేడు మండల పరిషత్ సమావేశం

ముసునూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

జూదం నిర్వహిస్తే చర్యలు

ఆగిరిపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, జూదం, అశ్లీల నృత్యాలు తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదన్నారు. నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. సంప్రదాయ క్రీడలు నిర్వహించాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేద పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య



సాయిశివసూరజ్

కైకలూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తన కుమారుడిని వేద విద్యలో ఉన్నత స్థానంలోకి తీసుకువెళ్లాలని వేదపాఠశాలలో చేర్పిస్తే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు చూపరులను కంట తడిపెట్టించింది. కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామంలోని శివాలయంలో అర్చకుడైన కందుర్తి శివశ్రీ, ఛాయదేవి దంపతుల కుమారుడు సాయిశివసూరజ్ (19) బుధవారం రాత్రి వేదపాఠశాలలో ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగేళ్ళుగా గుంటూరుజిల్లా కోటప్పకొండలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేదవిజ్ఞాన పీఠంలో వేద విద్యను అభ్యసిస్తున్నాడు. వేదపాఠశాలలోని కొంతమంది వేధింపులు తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టుగా స్థానికులు పేర్కొంటున్నారు. కుమారుడి మరణవార్త విని గురువారం ఉదయం భుజబలపట్నంలో తల్లిదండ్రులు బోరున విలపించారు. అనంతరం బంధుమిత్రుల సహాయంతో కోటప్పకొండ వెళ్లి పోలీసులకు కుమారుడి మృతిపై ఫిర్యాదు చేశారు. అర్చకుడు శివశ్రీ స్వగ్రామం కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం పెద్దతుమ్మిడి గ్రామం. కుమారుడి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తీసుకువెళ్లారు. భుజబలపట్నం గ్రామం నుంచి పలువురు పెద్దఎత్తున తరలివెళ్లి సంతాపం తెలిపారు.



చినకామనపూడి యూపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

కైకలూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రామవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించారు. రంగవల్లులను తీర్చిదిద్ది వాటిలో గొబ్బెమ్మలను అమర్చి భోగి మంటలు వేసి పిండివంటలు చేసి కార్యక్రమాలతో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ శ్రీలత పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం కిరణ్‌కుమార్, డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ ఎం హరిప్రసాద్, వై జ్ఞాన ప్రసూనాంబ పాల్గొన్నారు.

ముదినేపల్లి: చినకామనపూడి యూపీ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హెచ్‌ఎం పుట్టి గణేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంక్రాంతి ముగ్గులు వేసి భోగి మంటల చుట్టూ ఆనందంతో నృత్యాలు నిర్వహించారు. భోగిమంటలపై పాలు పొంగళ్లు నిర్వహించారు.

జూదాల జోలికి పోవద్దు : ఎస్‌ఐ

ముదినేపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో చట్ట వ్యతిరేకమైన జూదాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ముదినేపల్లి ఎస్‌ఐ వీరభద్రరావు హెచ్చరించారు. గురువారం పేరూరులో గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, ఇతర జూదాల నిర్వహణకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

మండవల్లి జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారిని సూర్య చక్ర వేణి మాట్లాడుతూ బాల్య వివాహా లు చేయడం, చేయడానికి సహా యం చేయడం రెండు నేరాలేనని, వీటి వల్ల చిన్నారుల జీవితాలు నాశనం అవుతున్నాయని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ శిరీష

కాల్వలను అభివృద్ధి చేయాలి

కైకలూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా కాల్వలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని కైకలూరు నియోజకవర్గంలోని డీసీ చైర్మన్లు కోరారు. కైకలూరు జలవనరుల శాఖ కార్యాలయం వద్ద గురువారం జలవనరులశాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో పనులు నిర్వహిం చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్లు పొత్తూరి వాసురాజు, పేటేటి సత్యనారాయణ, ముత్తం భోగేశ్వరరావు, కొండా, సురేష్‌బాబు, నానారావు, ఇరిగేషన్ డీఈ శిరీష, డ్రెయినేజీ డీఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

ముదినేపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):పెదగొన్నూరు గ్రామంలో సరిహద్దులోని రొయ్యల చెరువు నీటి ఊట కారణంగా తనకు చెందిన 3.50 ఎకరాల్లోని మినుము పైరు పూర్తిగా దెబ్బతిన్నదని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రవణం పూర్ణచంద్రరావు గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. తనకు సుమారు రూ.75 వేలు పెట్టుబడి నష్టం ఏర్పడిందని తెలిపారు. దెబ్బతిన్న మినుము పైరును వీఆర్‌వో వెంకట్రావు పరిశీలించారు.

అలరించిన కోలాటం

ముదినేపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా అకుంఠిత దీక్షతో అల్లూరు గ్రామ బాలబాలికలు నేర్చుకున్న కోలాటం అద్భుతమనిపించింది. కైకలూరు మండలం వేమవరప్పాడుకు చెందిన కోలాటం గురువు మీగడ సత్యనారాయణ వద్ద బాలలు కోలాటం నేర్చుకున్నారు. గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద బాలలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. గురువు సత్యనారాయణను తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, బీజేపీ నాయకురాలు రెడ్డి రాధికతో పాటు కోలాటం నేర్చుకున్న బాలబాలికలు సత్కరించారు.



శాంతినగరంలో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన

కలిదిండి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, నీటి సంఘం అధ్యక్షుడు మంతెన సుబ్బరాజు అన్నారు. గురువారం శాంతినగరంలో రూ.19.90 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు కూటమి నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. పంచాయతీ ఏఈఈ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్రాంతి కల్లా సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. సర్పంచ్ గద్దె ఆనంద్ కుమార్, కూటమి నాయకులు పోకల ప్రసాద్, కోకా సుభాకరావు, వెంకన్న, నాగు పాల్గొన్నారు.

'50 శాతం అర్జీలకు పరిష్కారం'

ముదినేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గతనెల 6 నుంచి ఈ నెల 8 వరకు మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ భూ సమస్యలకు సంబంధించి 390 అర్జీలు అందినట్టు తహసీల్దార్ సుభాని తెలిపారు. వీటిలో 190 అర్జీలను పరిష్కరించామని, మిగిలిన అర్జీలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రానున్న ఆరు నెలలపాటు ఉచిత సేవలు అందిస్తామన్నారు. మండలంలో 27 రెవెన్యూ విలేజీల్లో రీ సర్వే జరగ్గా ఆయా గ్రామాల్లో భూముల సబ్ డివిజన్‌కు సంబంధించి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపారు.

ఆర్‌ఎంపీ వైద్యశాల తనిఖీ

కైకలూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న వైద్యశాలలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ మాస్‌మీడియా అధికారిణి నాగరత్నం అన్నారు. కైకలూరు వారపుసంత సమీపంలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యశాల, మెడికల్ దుకాణాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆర్‌ఎంపీ వైద్యశాలలో నిబంధనలు పాటించడం లేదని వచ్చిన ఫిర్యాదులు మేరకు తనిఖీ చేశామని తెలిపారు.

మండవల్లి సబ్ రిజిస్ట్రార్‌గా బాలాజీ



మండవల్లి జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండవల్లి సబ్ రిజిస్ట్రార్‌గా బాలాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సుమారు 8 నెలలుగా మండవల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇన్‌చార్జి సభ్యులతో నడుస్తోంది. ఎట్టకేలకు మండవల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రార్‌ను నియమించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.